
# అమృతం కురవని రాత్రి

ప్రతికొంపా ఒక ఇండియన్ నేషనల్ కాంగ్రెస్సనుకుంటే ప్రతి ఇంట్లోనూ క్రమశిక్షణలేని ఒక ఇందిరాగాంధీ క్రమశిక్షణ కోసం గంతులు పెట్టే ఒక నిజలింగప్ప వుంటారుంటారు. ఇంటికో గాంధీ దొరకటం కష్టంగానీ, ఇంటింటికో ఇందిరాగాంధీ సులువుగా దొరుకుతుంది. ఇందిరా గాంధి ముక్కు అవి కాస్త పొడుగ్గావున్న అమ్మళ్ళందరూ బ్యూటిఫుల్సు కింద లెక్కవుతున్నారు. మూతి ఎన్ని వంకర్లుతిప్పినా ముక్కు చక్కగా వుంటే సరిపోతుంది. శూర్పణకకు ముక్కూ చెవులూ కోయబట్టికదా స్టోరీ సీతాపహరణం వరకు వెళ్ళి రాజకీయాలు రామరావణ యుద్ధంతో అంతమైంది. దీని కసలు రహస్యమేమిటంటే ఆడదాన్ని అవమానింప కూడదు. అది ముక్కు చెవులవద్ద ఆగకుండా యింకా పైకి క్రిందికి వెళుతుంది. గురువుగారన్నట్లు అప్పుడిహ మరి ఇంజన్ ఆగదు. ఆడదాయి రెచ్చిపోతే శక్తి స్వరూపమయిపోతుంది. మహిషాసురమర్ధనం జరిగిపోవల్సిందే— అప్పుడిహ క్రమశిక్షణా! అక్రమశిక్షణ అంటూ రూల్సు వల్లించి లాభంలేదు.

అసలాడాళ్ళముందు "రూల్సు" "మేనర్స్" ఏకరువుపెట్టిన వారందరూ ఏమయ్యారు? అరిస్టాటిల్ అలెగ్జాండర్ మనసు మళ్ళించ కలిగాడా? తార బృహస్పతిని పట్టి గొట్టించి చంద్రుడ్ని చేరుకోలేదా? మీరాబాయిని

ఆమె భర్త ఏం చేయకలిగాడు? మాట మళ్ళించేవాడేకాని ఆడదాని మనసు (లెఫ్టో రైటో) మళ్లించకలవారేరి?

ఈ కారణంచేత పెళ్లాన్ని ముక్క ముక్కలుగా నరికి కారంప్పింది పలుకు తినకపోయినా అప్పుడప్పుడు అందరూ మగాళ్లూ సోకాల్డు ఆడదానిమీద కసి తీర్చుకుంటూ వుంటారు. దాంపత్యంలో (పొలిటికలైనా సరే) "కసి" అనే రెండక్షరాల మాటమీద తీరుబడిగా రిసెర్చి చేయొచ్చు. నెవరయినా వంటింటి చెరసాలలో పడి కొట్టుకుని రంగులు వెలిపోయిన



రామచిలుక్కి బయట రెక్కలు ముక్కలు చేసుకుని బనీను చింపుకునే బలరాముడికి పొసగదొక్క క్షణం. ఒకరు మరొకరికి చెప్పరాని కసి ఏర్పడ్డంలో రవ్వంతయినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. వాళ్లని బాగు చేద్దామనుకుంటే ఫలితం రవంతయినా వుండదు. (ఆపు.... ఆపు.... ఆవాలు కాదు టేక్కర్.)

మొగుడూ పెళ్లాల దెబ్బలాటలకు ఎంటర్టైన్మెంట్ టాక్సు లేనట్లే పోలీసు కేసులు కూడా లేవు. పెళ్లాం కరిచేందనుకోండి దానిమ్మ గింజల్లా సూదుల్లాటి పళ్ళతో.... అంతకంటె కొంచెం సౌమ్యురాలు వేడిపులుసు వుడికీ వుడకని గుమ్మడికాయ ముక్కల్తోసహా చేతిమీద ఒంపేసిందనుకోండి - పాపం మీరేం చేయగల్రు. ఫో బయటికి ఫో

రాస్కెల్ అని కోప్పడగల్రు. మళ్ళీ మీకో సెకండ్ థాటొచ్చి పడుతుంది. బయట సొసైటీ దెబ్బతినే ప్రమాదముంది. అంచేత మీరే బయటికిపోతారు - సేఫ్.... సేఫర్.... సేఫస్ట్....! చీకటి పడేదాకా మీ పార్టీ వేరు....ఆవిడ పార్టీ వేరు. ఎలక్షన్లలో సిగ్గూ బిడియాలు, సిద్ధాంతాలు విడిచి అంతా కలిసిపోయినట్లు పందిరిమంచంమీద పవ్వళింపు సేవలు తప్పవు. అలగట మెంత సేపు - మళ్ళీ ఆమె కలవట మెంత సేపు. "పరసము విరసము కొరకే. పరిపూర్ణ సుఖమ్ము లధిక బాధలకొరకే, పెరుగుట విరుగుట కొరకే— దట్సాల్! ఆపైప మనకు రాదు.

పొద్దున్నే లేచి టూత్‌పేస్ట్ చప్పరిస్తూ - మీరజాలగలడా! నా యానతి అని పాడుకొంటుంది బాత్రూంలో. "పోబాల పోబాల పొమ్మికన్" అంటూ విడిచిపెడతాడామెను ఆ మంచం మహారాజు....ఆలోచించుకుంటే ఎ వెరి వెరిహ్యాప్ డే ఎష్టరడే (నిన్న మహా దుర్దినము) అనిపిస్తుందతనికి. ఇద్దరూ ఒక ప్లేటులో చెరో ఇడ్లీ కాకుండా .... ఒకే యిడ్లీ చెరోముక్క కొరుక్కుతింటారు. ఒక గ్లాసులో కాఫీ ఒక చుక్క ఆవిడ, ఒకచుక్క అతనూ తాగుతారు. తలకు నూనె రాస్తుంది. (తన కోసం తెప్పించుకున్న హేరాయిల్) వీపు తోమి నీళ్లు పోస్తుంది. నీకు నేనిలాటి పని చేయలేనే అని పులుసు పడిన చేత్తో ఆమె చెంపలను నిమురుతాడు. అక్కర్లేదులెండి అని పెళ్ళికూతురిలా సిగ్గుపడిపోయి క్షణంలో వస్తాను"అని బాత్రూంలో దూరుతుంది. బాత్రూంలోంచి పారే సబ్బు నురగకేసి చూస్తూ ఈవాళ సెలవు పెట్టనా అనుకుంటాడు. ఇంతలో పాతచీరో, తువ్వాలో చుట్టుకొనివచ్చి ఈ చీర కట్టుకోనా" అని అడుగుతుందామె. ఆహా! ఏమి ఈ శాండల్ పరిమళము.... మవ్వు కట్టుకున్నా కట్టుకోకపోయినా బానే వుంటావు సుమా అంటాడతను.... అలా కళ్ళు మూసుకోండి అని పురమాయించి అక్కడే గోడకేసి తిరిగి చీర కట్టుకుంటుందామె.

"ఆహా! ఏమి ఆ గోడకున్న అదృష్టము" అని మర్చిపోయి కళ్లు తెరుస్తాడు. లేచిపోండి ఇక్కడ్నుంచి అని ఆమె క్విట్ ఇండియా అని

గాంధీగారన్నట్లు చేత్తో గెటవుట్ సూచన చేస్తుంది లేనికోపాన్ని అభిన యిస్తూ, రోజూ చూస్తున్నదేగా - రోజూ చూసేదాన్ని గురించి వీళ్లెందు కింత గొడవ చేస్తారో అని అతను మరో గదిలోకెళ్లి సెలవుచీటీ రాస్తూ చింపుతూ ఆఖరికి మేగ్నకారా తయారుచేసినంత తృప్తితో కడుపు నొప్పిగా వుంది. ఆఫీసుకు రాలేనని ఒకరోజు క్యాజుయల్లీ నిమ్మని సెలవు పత్రం రాసి కిటికీతలుపు తెరిచి చూస్తూ వుంటాడు. చక్కని పెళ్లా న్నింట్లో వదిలేసి సైకిలు తొక్కుకుంటూ ఆఫీసుకెళ్లే చవటి వాళ్లైనా కనిపిస్తారేమోనని రోడ్డుమీద పడుచు పెళ్లాల వెచ్చని బాహుబంధాలనుంచి విడిపించి దూరం చేయటానికే యింటినుండి ఆఫీసువాకా రోడ్డు వేశారేమో ననిపిస్తుందతగాడికి. ష్యూర్! ష్యూర్! ఇంటినుంచి ఆఫీసుకు రోడ్డు వేయించకూడదు. రిక్షాలంత యిరుగ్గా ఎందుకుంటాయంటే, పెళ్ళాంతో సర్దుకు కూర్చుని మ్యాట్నీ సినిమా కెళ్ళడానికి వీలుగా అవి నిర్మించి వుండొచ్చు. రిక్షా నిర్మాతకు యువతీ యువకుల కష్టసుఖాలు బాగా తెలిసే పరుపులు మెత్తగా లోపల చీకటిగా కూర్చునేచోట్లు యిరుగ్గ వుండేట్లు రిక్షా నిర్మిస్తాడు. రిక్షాలో కూర్చున్న వారికి లోకవంటే రిక్షా తొక్కేవాడే—రిక్షా వాలా లెప్పుడూ ముందు చూపు మనుష్యులు. వాళ్ళు వెనక్కి తిరిగి చూడ కూడదు. పాపమో పుణ్యమో వెనక్కి తిరిగి చూడకుండా ప్రపంచ మార్గంగుండా పోతూవుంటారు. ఇంటినుంచి సినిమాహాల్స్‌కి వెళ్ళే రోడ్డు. అన్ని రోడ్లలోకిది బెస్టు బెస్టన్నర. మన కిష్టం వున్నపుడు రోడ్డు మనకి ఫ్రెండులానూ మనకిష్టంలేనపుడు అదే రోడ్డు మనకి ఎగస్పార్టీలానూ కని పించొచ్చు. ఒక్కే వస్తువు ఒకప్పు డోలాగా మరొకప్పుడు మరోలాగా కనిపించడాన్ని దొర్లు ఫినామినావో వల్లకాడో అంటారు లోకంలోని వస్తువులన్నీ ఆయా పరిస్థితుల్నిబట్టి మారినట్టూ మారుతున్నట్టూ కని పిస్తాయి.

రైలుబండి ప్రేమికులను, తల్లి కూతుళ్ళను, స్నేహితుల్ని కలుపు తుంది. విడదీస్తుంది. పోస్టుమ్యాన్ తన సంచీలో మంచీ చెడ్డా నింపుకొని

వస్తాడు. గాడిద మంచి గంధం పలకల్నీ, మాసిన బట్టల్నూ మోస్తుంది. లోకంలో అనుక్షణమూ ఏదో ఒకటి జరిగిపోతూ వుంటుంది. కిటికీమూసుకు కూర్చోడమా, తెరవడమా అనేది సమస్య. ఇది ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

అఫీసు నుంచి పూలపొట్లం మరియు గరం గరం పకోడీలు చేత్తో పట్టుకుని విజిల్ వేసుకుంటూ పాకెట్లో టెన్ రుపీస్ నోట్ గర గర మంటూండగా సైకిల్మీద యింటి కొస్తూంటే ఆ రోడ్ మనకు వసంతం పరిచిన పూలబాటలాగ అనిపిస్తుంపనిపిస్తుంది. రోడ్డు వేసే కూలీలకు ఖరీదులేని చెమటోడ్చే అర్ధనగ్న మానవులకు రోలర్ లాగేప్పుడు అది వారి పాలిటికి అన్నదాత—మెతుక్కీ మెతుక్కీ మధ్యనున్న బరువు అది లాగేవారి నిట్టూర్పులలోంచి బయటపడుతూ వుంటుంది. మనకేమీ కాదు.

రోడ్డుమీద కాల్జారి పడ్డప్పుడు మనకు లోకం తలక్రిందులుగా కనిపిస్తుంది. దీన్నే జగత్సర్వం మాయ మిధ్య అని టెక్నికల్గా శంకరుడన్నాడు. అసలు నిజంగా అంతా మనం అనుకోవడంలో వుంది. ఒకే క్షణంలో ఒకరికేది నిప్పుల మంటలవుతుందో మరొకరికది రంగు టద్దాల మేడ. ఇప్పుడు మన హీరో సెలవు చీటీ పంపిస్తున్నాడు కడుపునొప్పి పేరెట్టి—అది ఆఫీసరుకు నిప్పుల మంట కావచ్చు, కాకపోవచ్చు. బాత్రూంలోంచి వచ్చి చీర కట్టుకుని మ్యాట్నీ షో సినిమాకు తయారవుతున్న కులకాంతకు సెలవుచీటీ భర్త అరచేతిలో చూపిస్తున్న వైకుంఠం కావచ్చు, కాకపోవచ్చు. కూర తరుగుతున్న కులభామిని వెనుకకూర్చుని అతడామెకు జడ అల్లిపెట్టి తలలో పూలచెండు తురిమి ఘుమఘుమలాడే ఆమె శిరము మూర్కొనవచ్చు. అప్పుడామె వెనుక బరువుకు తూలి కత్తిపీటమీదపడితే ప్రమాదం జరుగవచ్చు. మ్యాట్నీకి వెళ్తుండగా వెనుకనుంచి లారీ వచ్చి గుద్ది దంపతులను క్షతగాత్రులను చేయవచ్చు, యమలోకానికి పంపనూ వచ్చు.

ఇవ్వేం జరగలేదనుకోండి-మ్యాట్నీకి తయారవుతూండగా హైదరాబాద్ ఎక్స్ప్రెస్లో ఆడపడుచూ అత్తగారూ ఆడపడుచు మొగుడూ

పిల్లలూ రెండు రిక్షాల్లో దిగారనుకోండి. మళ్ళీ అత్తెసరు పోయి కెక్కించడం, కూరలు తరగడం, పెద్ద పందిరి మంచం గది ఆడబడుచు కివ్వడం చాపా జంబుఖానా పుచ్చుగుని యివతల వరండాలో నేలమీద దొర్లడం అంతా మామూలే. దంపతు లిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకోలేరు. దెబ్బలాడుకున్న వెంటనే చుట్టాలొస్తే బాగుంటుంది, కాని సంధి జరిగిపోయి ఒకరి కొకరు మరింత దగ్గరవుతున్న శుభవేళలో చుట్టాలొచ్చి అంతా పాడు చేస్తే, ఆ రాత్రి పున్నమైనా అమావాస్య అయినా వారి పాలిటికి అమృతం కురవని రాత్రే!